# మనిషిలో మనిషి



పాంచాలి

ప్రవేశిక

మధ్యాహ్నం ఒంటి గంట కావస్తుంది.

నాలుగు బజారుల్లోనూ ముష్టెత్తి తెచ్చిన అన్నం పట్టుకుని చెరువు గట్టున కూర్చున్నాడు సోఁవఁడు.

ఏదో ఆలోచిస్తూ అన్నం కలుపుతున్నాడు. దూరం నుంచి లాటరీ టిక్కెట్లమ్మే దస్తగిరి వస్తూ కనిపించాడు. చంకలో అట్టకు క్లిప్పులు పెట్టిన టిక్కెట్లు లక్షల అంకెలు చూపుతున్నాయి.

ఎవర్నయినా ఒకరిని లక్షాధికారిని చేయాలని అతని ఆశ. ఆ అదృష్టవంతుడెవడో ఇంకా బయపడలేదు.

ఆ నెల కొనవలసిన టిక్కెట్టు అంతకు ముందే కొనేశాడు సోఁవఁడు.

## ప్రథమం : ఆశ్చర్యం

చెట్టు క్రింద కూర్చున్న సోఁవఁడి దగ్గరకు దస్తగిరి పరుగెత్తుకొచ్చి "సోఁవఁన్నా! నీ టిక్కెట్టు తీయ్! అర్జంటు," అన్నాడు.

"ఆఁ ఒచ్చేనా, సచ్చేనా! నెల నెలా జరిగేదేగా యీ తంతు. మళ్ళీ కొత్త చీట్లొచ్చినయ్యా అప్పుడే?"

"అసలు దేఖేంగే నిఖాలో !"

"సరే సూడు" అంటూ బొడ్లో ఉన్న టిక్కెట్టు దస్తగిరి చేతిలో పెట్టాడు. దస్తగిరి టికెట్టును, చేతిలో ఉన్న పేపరునూ ఒకటికి రెండుసార్లు చూచి "చలో సోఁవఁన్నా! నీకీ లక్షాధికారి. బంపర్ ఐదు లచ్చల్-పాంచ లాక్కా అధికారి" అంటూ సోఁవఁడి రెక్క పట్టుకొని ఒక్క వాణ్ణి ఒక్క ఉదటున లేపి చెట్టు మొదటి వేరు బొటన వేలును ముద్దు పెట్టుకొన్నా ఒదలకుండా లాక్కుపోయాడు సోఁవఁణ్ణి లాటరీ టిక్కెట్లమ్మే దస్తగిరి.

## ద్వితీయం: అద్భుత రసం

ఇంపాలా కారు పోర్టికోలో ఆగింది. దానిలో నుండి డ్రైవరు దిగి వెనుక తలుపు తెరిచాడు. వెనుక సీటులో నుండి సోమశేఖరం గారు (సోఁవఁడు) హుందాగా దిగారు. వారు దిగాక డ్రైవరు తలు వేసి ప్రక్కకు తప్పుకున్నాడు.

ఖరీదు గల చెప్పులు చప్పుడు చేయడం లేదు. ఖరీదుగల లాల్చి పొట్టను ఒరుసుకొని గరగర లాడుతుంది.

సోమశేఖరంగారు కార్పెట్ మీద మెల్లగా నడచి హాల్లోకి వెళ్ళి పై కండువా సోఫా మీద వేసి, ఆ సోఫాలోనే కూర్చున్నారు.

గతంలో ఆ శరీరాన్ని కాపాడాలని చొక్కా చాలా ప్రయత్నం చేసేది. కడుపు చొక్కాకు మురికి అంటుతుందని కాబోలు వెన్ను కంటుకొని ఉండేది. అదే పొట్ట యిప్పుడు లాల్చీకి రాపిన అత్తరు వాసన పీల్చాలని ముందుకు

వస్తుంది. ఆనాడు ఆ శరీరం నరాలు, ఎముకలూ కలగాపులగంగా. అతను కూర్చుంటే చెట్టు వ్రేళ్ళలా కనిపించేవి. ఇప్పుడా శరీరం రంగు మారి, రంగుమారి నరాలు, ఎముకలు ఉంటాయా అనిపిస్తుంది. గతంలో లోకాన్ని చూడలేక కళ్ళు లోతుకు పోయి ఉండేవి బుగ్గలతో పాటు. ఇప్పుడా కళ్లు లోకాన్ని గదమాయిస్తూ ముందుకు వస్తూంటే అడ్డుకోడానికి బంగారు ఫ్రేములో అద్దాలు బిగించి అడ్డం పెట్టుకున్నారు.

ఆయన అలా వచ్చి కూర్చోగానే, నౌకరువచ్చి సోఫామీది కండువా తీసి వంకెకి తగిలించాడు. అది చూస్తూ ఆయన కళ్ళజోడు తీసి అందించారు. అది నౌకరందుకొని టీపాయి మీద ఉంచుతూ, "అయ్యగారూ! మీరు రాగానే రామనాథంగారు ఫోన్ చెయ్యమన్నారండీ" అన్నాడు,

"వచ్చాడా?"

"ఆఁ! ఏదో అర్జెంటు అని మిల్లులోనే ఉంటానన్నారు"

"ఆ ఫోను యిటు తీసుకురా!"

నౌకరు టెలిఫోన్ ఆయనున్న దగ్గరకు తెచ్చి రిసీవరు ఆయన కిచ్చి రింగ్ చేశాడు.

సోమశేఖరంగారు ఒక్క క్షణం వుండి. "ఆఁ హలో, ఆఁ నేనే, ఆఁ హా! ఆఁ సరే ఐతే, ఒకటి... ఔను,.. అక్కరేనండీ. ఈసారి ఒకటీ ఒకటిన్నరకాదు, పాతపద్దు పాతిక వేలు యిస్తే నే సరుకెత్తండి, ఆఁ! ఆఁ, అంటే నేను చెప్పానని చెప్పండి మొహమాటం లేదు. ఇది పరకులా కాదయ్యా! ఔను,.. అంతా మారిపోయింది. ఆఁ! అన్నట్టు రంగనాథం, సేట్ పంపిన చెక్కులు రెండూ బ్యాంకుకు పంపాను. రెండింటిని జమచెయ్యి. ఆఁ ఔను. మొత్తంరాయి. అందులో దాపరికం దేనికి! రేపు ఆడిట్‌లో ఆఁ అందుకేగా అనడం, ఆఁఉంటా, సరే సరే ఆఁ" రిసీవరు నౌకరు కిచ్చారు, నౌకరు ఫోనును దాని స్థానంలో ఉంచి చెప్పాడు.

"శేఖరంగారు వచ్చాడు. బెంగుళూరు పోవాలన్నారంట గదా టిక్కెట్లు బుక్ చేయడానికి ఎళ్ళాడు అదుగో వస్తున్నాడు" మాటలో శేఖరం వచ్చాడు. నడి వయసు. నాజూగ్గా, అందంగా వున్నాడు. వస్తూనే "నమస్కారం సార్," అన్నాడు.

"టికెట్లు బుక్ చేశావా?"

తల ఊపాడు.

"నువ్వూ బయలుదేరు"

దానికూడా తల ఊపాడు శేఖరం.

## తృతీయం

## ఆనందో బ్రహ్మ: శృంగారం

అర్థమయ్యే వుంటుంది సోదండు సోమశేఖరంగామారాడు. మిల్లులో భాగం, సినిమాహాల్లో భాగం. చాలా వ్యాపారాల్లో పెట్టుబడి, సుమతీ శతకకర్త బద్దెన అన్నట్టు "సిరి తా వచ్చిన వచ్చును నారికేళ సలిలము భంగిన్".ఎందులో కాలుపెట్టినా వేలుపెట్టినా కలిపి వస్తుంది, అలవాట్లుకూడా పెరిగి పోయాయి. ఎంత పెరిగినా కరగిపోని తీరుకు ఎదిగిపోసాగాడురెండు సంసారాలు చాలక మధ్య మధ్య టిఫిన్ అన్నట్టు కళా కారిణుల కౌగిళ్ళు. వాళ్ళలో ఏదో వున్నట్టు భ్రమ. అందరిలానే అతనుగూడా మనిషేగా! అందుకని బెంగళూరు, మద్రాసు, ఊటీ గూడా పోటం కద్దు.

ఒక హోటల్లో A C రూమ్‌లో వుండి శేఖరాన్ని పిలిచారు.

శేఖరం వచ్చి "ఎకౌంట్సు చూస్తారా? పదిదాకా మనకు....."

"నువ్వున్న దెందుకయ్యా- నేను లెక్కలు చూడ్డానికా? ఆ తంటా లేవో నువ్వే పడు. ఆఁ అన్నట్టు ఆ కన్నయ్యగాడు ఎక్కడున్నాడో ఫోనులో పెదుకు!

"వాడు క్రింద వున్నాడుసార్"

"సరుకేమన్నా కొత్తది వుందన్నాడా!"

"ఏమో సార్, అడగ లేదు. అడగ మంటారా!"

"నువ్వొద్దులే వాణ్ణిక్కడికి పంపు"

"సరేసార్! మరి ఆ రాత్రి వచ్చిన డ్యాన్సర్ని రమ్మన్నారుట. పంపమన్నారా?!"

"దాని బొంద. సినిమాలోలాగా ఒళ్ళు చూపిస్తే ఏంలాభం? దానికేం తెలియదు. పైగా ఇక్కడ దొరకని స్పానిష్ సరుకు సగం సీసా తాగి పడుకొని నిద్రపోయింది. దానికి ఈయవలసింది యిచ్చి పంపు"

"సరేసార్, కన్నయ్యాని పంపమంటారా!"

సోమశేఖరంగారు తల ఊపారు. శేఖరం వెళ్ళిపోయాడు. టీపాయి మీదున్న సీసాలోని 'జిన్' గ్లాసులోకి వంచి, ప్రక్కనున్న లెమనేటుకూడా ఒలక బోసి, గ్లాసులోని ఐసు ముక్కలు స్పూనుతో అందులో వేసి చూస్తున్నారు. జిన్, లెమనేట్ ఐస్ కలగా పులగమౌతున్నాయి.

మెల్లగా పెదవులకందించి సిప్ చేశారు. అంతలో తలుపు శబ్దమయ్యింది.

"ఆఁ! రా! రా!" అన్నారు.

కన్నయ్య నిలువుగా నిండు

విగ్రహం. అతన్ని చూస్తే అతడా పని చేస్తాడని ఎవరూ అనుకోరు. జమిందారులా ఉంటాడు.

"ఇదిగో కన్నయ్యా! రాత్రి డ్రాన్సర్ లాభంలేదయ్యా అయ్యో అయ్యో చూపిస్తూ సినిమాల్లో బ్రతికే పిల్లదాని దగ్గరేముంటుంది? మునుపొకసారి తెచ్చావుచూడు రామశ్రీ, రమణశ్రీయో అన్నావు. అసలు పేరు రవణనుకుంటా. దాన్నిపత్రా రాత్రికి దానితో యెవారం గడిపేస్తాను." అంటూ గ్లాసులోది తాగటం ప్రారంభించాడు.

కన్నయ్య వెళ్ళిపోయాడు. కొద్దికొద్దిగా గ్లాసు ఖాళీచేసి మళ్ళా గ్లాసులు నింపుకున్నాడు టీపాయి మీదున్న కాలంగ్ బెల్ నొక్కగానే హోటలు బాయ్ వచ్చాడు 'సార్' అంటూ,

ఏమన్నా తింటానికి ఆమ్లెట్, చిక్కెన్ ఫ్రై....

సలాంకొట్టి వెళ్ళిపోయాడు బాయ్,

## చతుర్థం-శోకరసం

ప్రక్కగదిలో ఏవో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంత వినకూడదు అనుకున్నా వినాలని పించింది మనసులో. చాటుగా నిలచి ఆలకించాడు సోమశేఖరం.

ఆ యిల్లు సోమశేఖరంగారి టూటౌన్-అంటే నాగరికంగా నన్నమాట-మరోరకంగా చెప్పాలంటే ఉంపుడుకత్తె లేక రెండో భార్య ఉంటున్న యిల్లు.

ఆ లోపల జరుగుతున్న సంభాషణ అంతా తనని గూర్చే. ఆ వేళప్పుడు అతగాడు క్లబ్బులో ఉంటాడని ఉంచి వచ్చినట్లుగా మగ గొంతు అంటుంది.

రెండు గొంతులు కలపి వేసుకొన్న పథకం అంతా విన్నాడు సోమశేఖరం. తన కాళ్లు వణుకుతున్నాయి. ఏమీ తోచింది కాదు. కళ్ళు తిరుగుతున్నట్లు ఉన్నాయి. కాళ్ళు తేలిపోతున్నాయి. వరుసగా ఒకటిన్నర బాటిల్ రమ్ము త్రాగినా, ఆ తూలుడు రాదాయనకు. మొహం కంద గడ్డలా మారిపోయింది.

అలాగే లోనికి వెళ్లి యిద్దరినీ ఛడా మడా తిడదామా అనుకున్నాడు. ఎందుకో మనస్కరించలేదు. తన్ను తాను సంబాళించుకొని, తిరిగి యిల్లు చేరి నిద్ర రాక బాగా త్రాగాడు. ఆ తర్వాత ఎప్పటికో నిద్ర పట్టింది. అది నిద్ర కాదు మత్తు.

## పంచమం-పతాక

## సన్నివేశం: ముగింపు

సోమశేఖరంగారి రెండవ భార్య

ఉంటున్న యింట్లో శయన మందిరానికి ప్రక్క నున్న సోఫాలో కూర్చుని ఉన్నారు. ఎదురుగా నిలువుటద్దం.దానిలో ప్రక్క నున్న ఖరీదైన మంచం కనిపిస్తూంది.

సోఫాకు యెదురుగా ఉన్న టీపాయిమీద జానీవాకర్ సీసా మూత తీయబోయి ఆగిపోయాడు. చేతు లెందుకో వణికాయి. గుండె ఒక సారి వేగంగా కొట్టుకొని మామూలు స్థితికి వచ్చింది.

ప్రక్కనున్న వేయించిన జీడీ పప్పు ప్లేటు భయంకరంగా కనుపిస్తుంది. దాని కానుకొని ఉన్న చికెన్ ఫ్రై అదోలా కనిపించింది. త్రాగక ముందే మత్తు వచ్చినట్లుగా ఉంది. మత్తు కాదు. మత్తుకు ముందుగా కలిగే ఉషారు - నిషా లాంటిది కలిగింది.

ఆ తర్వాత ఆయనకు క్షణం ఒక యుగంగా గడిచింది. ఏంవిటబ్బా ఇంకా రాజ్యం రాలేదు. పిలుద్దామా అని అనుకున్నాడు. మళ్లీ రానీలే అని తనలో తనే సమాధాన పడ్డాడు.

అనుకుంటుండగా రాజ్యం ఆ గదిలోనికి రానే వచ్చింది. ఆడదానిలో మగవాడు కోరుకునే హంగులన్నీ ఆమె కున్నాయి. మొత్తానికి రాజ్యాన్ని ఎన్నిక చేయడంలో సోమశేఖరం అభిరుచి అట్టే పసికట్టవచ్చు.

ఆమె గదిలోనికి రాగానే అందం నడచి వచ్చినట్టుగా ఉంది. వస్తూనే తెల్లని పల్వరుస కనిపించేలా నవ్వుతూ "అదేంవిటీ? యింకా అలాగేఉన్నారు" అంది వయ్యారం ఒలికించే పలుకులు చిలుకరిస్తూ.

"ఇద్దరం కలసి తాగుదామని" అన్నాడు సర్వసాధారణంగా అన్నట్లుగా.

"నేనా? నేను! నే నివేళ...." ఏదో అనబోయింది. అంతలో ఆయనే "తాగనని అన్నావనుకో. ఐనా నా సరదా నాది కదా? అసలైన త్రాగుబోతు తోడు లేకుండా తాగు తాడా? అలవాటయ్యాక. రా రా!" అన్నారు.

"నా కొద్దులెండీ. మీరు పూర్తి చేయండి." అంటూ ప్రక్కన కూర్చుని గ్లాసులో జానీవాకర్ వంచి స్పెన్సర్ సోడా మూత తీసి కలిపింది.

ఆ సోఫాలో ఆమె దాపుకు జరిగి కూర్చున్న తీరు, అందిస్తున్న పద్ధతిని చూస్తే అర్ధ నారీశ్వరుని కాలెండరు గుర్తు కొస్తూంది.

"ఆం త్రాగండీ!" అంది గోముగా దానిని వగలు పోవడం అని కూడా అనుకోవచ్చు. ఆ

చూపు. ఆ అంటున్న తీరూ వింటూ "రాజ్యం" అన్నారు సోమశేఖరం గారు చాలా నిదానంగా.

" సరేగాని త్రాగుతూ, తింటూ మాట్లాడండి వింటాను." అంది. అప్పటికి ఆమె అవయవాలు ఎక్కడెక్కడ అమిరితే మగవాడు పిచ్చివాడవుతాడో అక్కడక్కడ ఉన్నాయి.

"తాగి, తిన్న తర్వాత ఇంక నీతో నేనేం చెప్పగలను?" అన్నారు. "మీ సంగతి నాకు తెలియదా యేం? ఒక పట్టాన మీకు మత్తు రాదుగా." అంది గ్లాసు ఆయన నోటి దగ్గరకు చేరుస్తూ.

"ఇదివరకైతే అంతేననుకో. ఇవాళ అలా కాదుకదా! రాజ్యం, శేఖరం, నువ్వు కలిసి వేసిన పథకం ప్రకారం రెండు గుక్కలతో నేను...."

మాట మధ్యలోనే రాజ్యం ప్రక్కలోనుండి లేచి 'ఆఁ అంటే' అని యింకా యేదో అనబోయింది.

"మీ ప్లాను నాకు తెలిసింది రాజ్యం!"

"మీరు....మీరు...."

"సోమశేఖరాన్ని. రా! కూర్చో ఇద్దరం త్రాగుతూ తిందాం. రా! ముందు నువ్వు త్రాగి ఇది తిను" అంటూ ఎదురుగాఉన్న చికెన్ప్లేట్ చేతపట్టుకొని పిలిచాడు చాలా మామూలుగా. రాజ్యం మాటాడలేక పోతోంది. "రా! ఇది తిను" అన్నాడు పెద్దగా. అంత పెద్దగా అతగాడు మాటాడగలడని రాజ్యం ఎప్పుడూ అనుకోలేదు. అంత గొంతు ఉందని కూడా ఊహించలేదు. రాజ్యం పలకలేదు, కదలలేదు. దీనంగా చూడ్డం మొదలుపెట్టింది.

"రా! తినూ." అన్నాడు మళ్ళీ.

తలాడించింది రానని.

"రావా? రావా?? తినవా??" అని గద్దించాడు. భయం భయంగా తలాడించింది.

అంతే సోమశేఖరం ఉగ్రరూపం దాల్చి చేతిలోని పళ్ళాన్ని విసరి ఆమె ముఖానికేసి కొట్టాడు. రాజ్యం తప్పుకొంది. ప్లేటు గోడకు తగిలి పగిలి ముక్కలు ముక్కలయింది. ప్లేటులోనిదంతా చిందరవందరైంది.

అంతే! అంతే జరిగింది.

కానీ ఒక విచిత్రం.

చెట్టు క్రింద పోఁవఁడి చేతిలోని కాశీ కొబ్బరి చిప్ప దూరాన యెదురుగా పడివుంది. దానిలోని అన్నం నేలను పరచుకోనుంది. వాడి చూపు దగ్గరి తీసుకొని వెళ్తూన్న చీట్లమీదనుండి అప్పుడే ముందుకు చూచింది. చేతిలో చిప్ప దూరంగా ....అందులోని...అందులోని...ఆ తర్వాత వాడు ఏం ఆలోచించాడో ...మనకెలా తెలుస్తుంది. *